క్లుప్తంగా

పెద్దమ్మతల్లీ దీవించు



దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూగోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మవారిని నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి అభిషేకాలు, హారతులు పట్టారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయకమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

విద్యుత్ చార్జీలు రద్దు చేయాలి



విద్యుత్ బిల్లులు దహనం చేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పెంచిన విద్యుత్ చార్జీలను రద్దు చేయాలని సీపీఎం పట్టణకార్యదర్శి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఎస్‌బీఐ కాలనీలో సీపీఎం ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లులను దహనం చేశారు. ఆయన మాట్లాడుతూ పెరిగిన విద్యుత్ చార్జీలను రద్దు చేయాలని, విద్యుత్ ఒప్పందాలను కూటమి ప్రభుత్వం వెంటనే రద్దు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అనిత, భారతి, మున్ని, గీతా, మద్దమ్మ, మరియమ్మ, మేరమ్మ, పాల్గొన్నారు.

వీఆర్ఏల నూతన కమిటీ ఎన్నిక



మాట్లాడుతున్న రామచంద్రారావు

నంద్యాల(అర్బన్): స్థానిక నిశాంత్ భవన్‌లో జిల్లా గ్రామ రెవెన్యూ సహాయకుల కమిటీ నూతన అధ్యక్ష కార్యదర్శుల ఎంపిక కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా అక్తర్‌బాషా, కార్యదర్శిగా రవితేజారెడ్డి, సహాయ అధ్యక్షులుగా రమాదేవి, ఉపాధ్యక్షులుగా ఖాజా, మద్దిలేటి, శ్రీనివాసులు, నాగేంద్ర, ట్రెజరర్‌గా భాగ్యలక్ష్మిని ఎన్నుకున్నారు. రాష్ట్ర రెవెన్యూ సహాయకుల సంఘం అధ్యక్షుడు బ్రహ్మయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఏపీఆర్ఎస్ఏ నంద్యాల జిల్లా కార్యదర్శి రామచంద్రారావు మాట్లాడుతూ నూతన కమిటీ వీఆర్ఏలు సంఘాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు కామేశ్వరరెడ్డి, ట్రెజరర్ నాగరాజు, సెక్రటరీ విజయశేఖర్, రామసంజీవరావు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాల హోం టీమ్స్ కబడ్డీ పోటీలు

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పట్టణంలోని ప్రథమనంది దేవస్థానం తిరునాల మహోత్సవం సందర్భంగా నందిపైప్స్ సౌజన్యంతో ఎస్పీవై రెడ్డి జ్ఞాపకార్థం నంది గ్రూప్ సంస్థల అధినేత సుజల అధ్యక్షతన ఉమ్మడి జిల్లాల హోం టీమ్స్ కబడ్డీ పోటీలను ఆదివారం నిర్వహించారు. పోటీల్లో 25 టీంలు పాల్గొన్నట్లు నందిపైప్స్ షటిల్ అడ్వైజర్ వంశీ, ఫిజికల్ ఎడ్యుకేషన్ గౌరవాధ్యక్షులు నిమ్మకాయల సుధాకర్, ఏపీరెడ్డి తెలిపారు. గెలుపొందిన జట్లకు వరుసగా.. రూ.25వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేలు అందజేశారు. అనంతరం క్రీడాకారులకు టీషర్టులను అందజేశారు. కార్యక్రమంలో దండె నాగరాజు, కబడ్డీ నిర్వాహకులు శివరామిరెడ్డి, రమణ, గోపి, వ్యాయామ ఉపాధ్యాయులు మల్లికార్జున, శీను, శాంతరాజు, కిశోర్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా క్యాండిల్స్ ఆరాధన



సీఎస్ఐ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

దొర్నిపాడు: మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో ఆదివారం రాత్రి క్రిస్మస్ పండుగకు ముందుగా జరిపే క్యాండిల్స్ ఆరాధనను ఘనంగా నిర్వహించారు. క్రైస్తవులంతా క్యాండిల్స్ వెలిగించి ప్రార్థనలు చేశారు. దేవుడు వెలుగై ఉన్నాడని, క్రీస్తు జన్మదినం గొప్పదని పాస్టర్ స్వర్ణ ప్రభాకర్ సందేశం ఇచ్చారు.

ఎయిడ్స్ రహిత సమాజమే లక్ష్యం



మాయలూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఉయ్యాలవాడ: ఎయిడ్స్ రహిత సమాజ స్థాపనే ధ్యేయంగా ప్రజలను చైతన్య పరచాలని వైద్యాధికారి రాబర్ట్‌కెనడీ పిలుపునిచ్చారు. ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ నియంత్రణ దినోత్సవం సందర్భంగా మండలంలోని మాయలూరు ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ.. హెచ్ఐవీ అంటు వ్యాధి కాదని, వ్యాధి సోకిన వారిపై వివక్ష చూపకూడదని సూచించారు.



డి.కొట్టాల వద్ద నేలవాలిన వరి



క్రిష్టిపాడులో పొగాకు తోరణాలకు కప్పిన పట్టలు

రైతుల్లో ఫెంగల్ దడ

- ఈదురు గాలులతో నేలవాలుతున్న వరి
- ఆరబోసిన ధాన్యం తడవకుండా రైతుల పాట్లు



గుండుపాపల సమీపంలో నేలవాలిన వరి పైరు

రుద్రవరం: మండలంలోని రైతులకు ఫెంగల్ తుపాను దడ పట్టుకుంది. రెండు రోజుల నుంచి ఆకాశం మేఘావృతమై ఈదురు గాలులు వీస్తున్నాయి. దీంతో కోత దశలో ఉన్న వరి నేల వాలుతుందని కొందరు, ఆరబోసిన ధాన్యం ఎక్కడ తడుస్తుందో అన్న భయం మరికొందరు రైతుల్లో నెలకొంది. మండలంలోని 21 గ్రామ పంచాయతీల పరిధిలో కొద్ది రోజుల నుంచి వరి కోతలు జోరుగా సాగుతున్నాయి. వచ్చిన ధాన్యం దిగుబడులను రోడ్లు, కళ్లాల్లో ఆరబోశారు. ఈ తరుణంలో వాతావరణ శాఖ ఫెంగల్ తుపాను హెచ్చరించింది. తుపాను ప్రభావంతో ఆదివారం ఈదురు గాలులు వీస్తూ ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో రుద్రవరం, కోటకొండ, నర్సాపురం, అప్పనపల్లె, చిన్నకంబలూరు, పెద్దకంబలూరు, డీ.కొట్టాల, ఆలమూరు, హరినగరం తదితర గ్రామాల పరిధిలోని రైతులు రోడ్లపై ఆరబోసిన వరి ధాన్యాన్ని తడవకుండా కుప్పలుగా చేసుకుని పట్టలు కప్పారు. డీ.కొట్టాల వైపు ఇది వరకే వరిలో నీరు నిల్వ ఉంది. తుపాను ప్రభావంతో వీస్తున్న ఈదురు గాలులకు వరి పైరు నేలవాలి నీటిలో తడుస్తోంది. అలాగే వదిలేస్తే మొలకలు వస్తాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

దొర్నిపాడు: ఫెంగల్ తుపాను రైతులను నష్టాల్లోకి నెట్టింది. వర్ష ప్రభావం పెద్దగా లేకపోయినా ఈదురు గాలులతో వరి నేలవాలడంతో వడ్లనీ నేల రాలుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. అలాగే కంది పూత కూడా రాలిపోతుండడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. ఇక పొగాకు తోరణాలు వర్షానికి తడవకుండా ఏకంగా పట్టలను కప్పేశారు.



స్వామివారి గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఘనంగా అయ్యప్పస్వామి విళక్కి పూజ



పదునెట్టాంబడి పూజ నిర్వహిస్తున్న స్వాములు

చాగలమర్రి: మండల కేంద్రంలోని పాత బస్టాండ్ సమీపంలో వెలసిన అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం విళక్కిపూజ, గ్రామోత్సవం, దీపోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అయ్యప్పస్వామి సేవా సమాజం ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. మాలధారణ చేసిన భక్తులు 40 రోజుల మండల దీక్ష పూర్తి చేసిన సందర్భంగా విళక్కి పూజ నిర్వహించినట్లు అధ్యక్షుడు సుంకు జనార్ధనరావు తెలిపారు. విళక్కి పూజలో భాగంగా ఆలయ అర్చకులు పవన్ కుమార్ ఆధ్వర్యంలో ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, భజన, గణపతి హోమం నిర్వహించారు. రాత్రి అయ్యప్పస్వామి విగ్రహాన్ని ఆలయం నుంచి మెయిన్ బజార్ మీదుగా గాంధీ సెంటర్ వరకు గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయంలో పడిపూజ చేశారు. 18 మెట్లను వివిధ రకాల పూలతో సుందరంగా అలంకరించి, దీపాలు వెలిగించి విశేష పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అయ్యప్పస్వామి సేవా సమాజం పాలకవర్గ సభ్యులు ఎం.లక్ష్మీనారాయణ, టి.విద్యాసాగర్, వి.నరేంద్రకుమార్, కె.శివప్రసాద్, ఎం.సుబ్రమణ్యం, టి.వినయ్‌కుమార్, వై.రవికిరణ్, జె.రవికుమార్, ఎ.సుబ్బారావు, ఎం.పృథ్వీనాథ్, కె.జగదీష్, ఎస్.రాజేష్, గురుస్వాములు వి.నాగేశ్వరరావు, పి.ప్రతాపరాయుడు పాల్గొన్నారు.

ఓంకారం హుండీ ఆదాయం రూ. 1,61,151



హుండీ ఆదాయం లెక్కిస్తున్న భక్తులు

బండిఆత్మకూరు: మండలంలోని ఓంకారేశ్వరాలయ హుండీ ఆదాయాన్ని ఆదివారం లెక్కించగా రూ. 1,61,151 లు ఆదాయం వచ్చినట్లు ఈఓ నాగ ప్రసాద్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ కార్తీక మాసం ముగింపు సందర్భంగా హుండీలను తెరిచి లెక్కించినట్లు వెల్లడించారు. కార్యక్రమానికి పర్యవేక్షణాధికారిగా నంద్యాల డివిజన్ ఇన్‌స్పెక్టర్ పి.హరిశ్చంద్రారెడ్డితో పాటు ఆలయ అర్చకులు మల్లికార్జున పాల్గొన్నారు.

కనుల పండువగా శివపార్వతుల కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని బైర్మల్‌వీధిలో వెలసిన శ్రీబసవేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం కార్తీక అమావాస్యను పురస్కరించుకొని శ్రీపార్వతీ, పరమేశ్వరుల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ముందుగా బసవేశ్వర మూలవిరాట్‌కు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం పార్వతీ, పరమేశ్వరుల ఉత్సవ మూర్తులను పట్టువస్త్రాలచే అలంకరించి శాస్త్రోక్తంగా, వేదమంత్రాల సాక్షిగా శశిభూషణ్ సిద్ధాంతి ఆధ్వర్యంలో కల్యాణం జరిపించారు. బద్రిశెట్టి అమర్నాథ్ దంపతులు, శివానందప్రసాద్ దంపతులు పెళ్లిపెద్దలుగా వ్యవహరించారు. అనంతరం మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం పార్వతీ పరమేశ్వరులను నందికోల ఉత్సవంతో గ్రామోత్సవం చేపట్టారు. పట్టణ వీరశైవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ఉయ్యాలవాడ: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. సమస్యలపై మండల ప్రజలు వినతులు అందజేయవచ్చని వెల్లడించారు. రెవెన్యూ కార్యాలయంలో జరిగే ఈ ప్రజా వేదికకు అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని సూచించారు.

ఉపాధ్యాయ వృత్తి మహోన్నతమైనది

- ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, ఎంపీపీ వీరభద్రుడు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి



హెచ్‌ఎం కోటయ్య దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

చాగలమర్రి: ఉపాధ్యాయ వృత్తి ఎంతో మహోన్నతమైందని, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తారని పశ్చిమ నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, చాగలమర్రి ఎంపీపీ వీరభద్రుడు అన్నారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పదవీ విరమణ పొందుతున్న ప్రధానోపాధ్యాయుడు ఎం.కోటయ్యకు వీడ్కోల సమావేశం నిర్వహించారు. ఆయన సేవలను కొనియాడారు. పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు వారిని ఉన్నతంగా తీర్చిదిద్దారని తెలిపారు. అనంతర హెచ్‌ఎం కోటయ్య దంపతులను ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, స్నేహితులు పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓలు న్యామతుల్లా, అనురాధ, ఇన్‌చార్జి హెచ్‌ఎం ఐడీకే శాస్త్రీ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జి.కుమార్‌రెడ్డి, సాగునీటి సంఘం అధ్యక్షుడు శేషు రమేష్, ఉపాధ్యాయులు శివశంకర్, రవీంద్రారెడ్డి, మౌలాళి, మహబూబ్‌బాషా, ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు ముల్లా మహబూబ్ బాషా, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాన్ని ప్రదర్శించాలి

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థులు అన్ని రంగాల్లో నైపుణ్యాన్ని ప్రదర్శించాలని, తల్లిదండ్రులు కూడా ప్రోత్సహించాలని మంత్రి ఫరూక్ అన్నారు. ఆదివారం సాయిబాబానగర్‌లోని నారాయణ విద్యాసంస్థల్లో ఓరియంటల్ ప్రోగ్రాం నిర్వహించారు. కార్యక్రమంలో నంద్యాల జోన్ బ్రాంచీలు గిద్దలూరు, నందికొట్కూరు, మర్కాపురం విద్యార్థులకు పోటీలు నిర్వహించగా ఎంపికైన వారికి ఫైనల్ లెవెల్ పోటీలు జరిపించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ నైపుణ్యాన్ని ప్రదర్శించిన విద్యార్థులకు ఏజీఎం ప్రశాంత్‌తో కలిసి బహుమతులు అందజేశారు. స్కూల్ ఆర్ఐ చంద్రమౌళి, కోఆర్డినేటర్, ప్రిన్సిపాళ్లు, హాస్టల్ ప్రిన్సిపాల్ స్వరూపాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాల మల్లేష్ మృతి సీపీఐకి తీరనిలోటు

నంద్యాల(న్యూటౌన్): సీపీఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాల మల్లేష్ ఆకస్మిక మృతి పార్టీకి తీరని లోటు అని నంద్యాల జిల్లా సీపీఐ ప్రధాన కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్ ఆదివారం ఓ ప్రకటనలో విద్యార్థి ఉద్యమంలో అలుపెరని పోరాటాలు చేశారన్నారు. సీపీఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉద్యమిస్తున్న ఉద్యమ నాయకుడు బాలమల్లేష్ మృతి చెందడం బాధాకరమన్నారు. ఆయన ఆశయ సాధన కోసం కలిసి కట్టుగా పోరాటం చేయాలన్నారు.

జీసీటీఏ నూతన కార్యవర్గం ఎన్నిక

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని బొమ్మలసత్రంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నంద్యాల జిల్లా జీసీటీఏ(గవర్నమెంట్ కాలేజీ టీచర్స్ అసోసియేషన్) మొదటి కార్యవర్గ ఎన్నిక నిర్వహించినట్లు జిల్లా అధ్యక్షుడు కాటంరెడ్డి రామలింగారెడ్డి, ప్రధాన కార్యదర్శి పున్నారావు, మహిళా కార్యదర్శి ఫరీదాబేగం తెలిపారు. ఆదివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లా అధ్యక్షుడిగా రామలింగారెడ్డి, ప్రధాన కార్యదర్శి పున్నారావు, మహిళా కార్యదర్శి ఫరీదాబేగంను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఎన్నికల అధికారిగా డాక్టర్ లక్ష్మయ్య, నాగన్న, పరిశీలకుడిగా వెంకటయ్యను ప్రకటించారు. కార్యక్రమంలో జీసీటీఏ అకాడమీ సెక్రటరీ శ్రీనివాసులు, జోనల్ కార్యదర్శి ఎల్లాకృష్ణ, నంద్యాల జిల్లా ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

బలిజలు అన్ని రంగాల్లో ఎదగాలి



శాంతిరాముడును సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): బలిజ సంఘీయులు అన్ని రంగాల్లో ఎదగాలని సంఘం నాయకులు వర్ధంశెట్టి రాజారాం, మిద్దె శాంతిరాముడు పేర్కొన్నారు. స్థానిక భీమలింగేశ్వర స్వామి ఆలయ ఆవరణలో ఆదివారం నంద్యాల బలిజ వంశీయుల కార్తీక మాస వనభోజన కార్యక్రమం నిర్వహించారు. వందలాది మంది సంఘీయులు హాజరైన సమావేశంలో వారు మాట్లాడుతూ ఆర్థికంగా ఎదకపోవడంతోనే బలిజలు రాజకీయంగా రాణించలేకపోతున్నారన్నారు. ఆర్థికాభివృద్ధి సాధించి బలిజల సత్తా చూపాలన్నారు. విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కులస్తులు కొండయ్య, రామచంద్రారావు, పసుపులేటి నారాయణ, రామస్వామి, సాయికృష్ణ, ఇంటి ఆదినారాయణ, రంగయ్య, రాజశేఖర్, డాక్టర్ రవి కృష్ణ పాల్గొన్నారు.



పూలంగిసేవలో ప్రథమనందీశ్వరుడు



కాళికాంబ చంద్రశేఖరస్వామికి అన్నాభిషేకం నిర్వహించిన దృశ్యం



ప్రథమనంది ఆలయ ఆవరణలో స్వామి, అమ్మవార్లకు రథోత్సవం

భక్తిశ్రద్ధలతో కార్తీక అమావాస్య పూజలు



గాజుల అలంకారంలో కేదారేశ్వరి మాత



భీమలింగేశ్వరుడికి భస్మాభిషేం నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): కార్తీక మాసం చివరి రోజు ఆదివారం అమావాస్యను పురస్కరించుకొని పట్టణంలోని పలు శైవ ఆలయాల్లో భక్తులు అభిషేకాలకు తెల్లవారుజాము నుంచే పోటెత్తారు. శైవ ఆలయాల్లో పంచామృతాభిషేకాలు, మహాన్యాస పూర్వక ఏకరుద్రాభిషేకాలు, అన్నాభిషేకం, లక్ష బిల్వార్చన పూజలు, కల్యాణాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం ప్రదోషకాల పూజలు నిర్వహించి స్వామి వారికి నాగాభరణాన్ని అలంకరించి పూలంగిసేవ కార్యక్రమం జరిపించి, చివరగా మహామంగళ హారతులు ఇచ్చారు. అలాగే ఆకాశ దీపాన్ని వెలిగించారు.

- ప్రథమనంది ఆలయంలో తెల్లవారుజాము నుంచే స్వామి వారికి మహన్యాస పూర్వక ఏకరుద్రాభిషేకాలు, నమకం, చమకం పూజలు చేసి స్వామి వారిని ప్రత్యేక అలంకారంలో అలంకరించి పూలంగిసేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కేదారీశ్వరి మాతకు గాజుల అలంకారం చేశారు. సాయంత్రం ప్రథమనందీశ్వర స్వామి, కేదారేశ్వరి దేవి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టువస్త్రాలతో అలంకరించి దేవాలయ ఆవరణలో రథోత్సవం చేపట్టారు.
- కాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానంలో పంచామృతాభిషేకాలు నిర్వహించి అనంతరం అన్నాభిషేకం, లక్ష బిల్వార్చన కార్యక్రమం జరిపించారు.
- సంజీవనగర్ రామాలయం దేవస్థానంలో కాశీవిశ్వనాథుడికి సాయంత్రం శ్రీరుద్రం పఠనంతో పలు రకాల పూలతో స్వామి వారికి పుష్పాభిషేకం నిర్వహించారు.
- నాగలింగేశ్వర ఆలయంలో నాగలింగేశ్వరస్వామికి ఉదయాన్నే పంచామృతాభిషేకాలు, మహాన్యాస పూర్వక ఏకరుద్రాభిషేకం, నమ్మకం, చమకం, రుద్రం తదితర పూజలు నిర్వహించారు.
- టెక్కెలోని నాగులకట్టలో వెలసిన అభయాంజనేయస్వామికి అభిషేకాలు చేపట్టారు. సింధూరాభిషేకం జరిపించి స్వామి వారికి తమలపాకులు, జిల్లేడు ఆకులు, వడమాలలతో అలంకరించారు.





సంజీవనగర్ కాశీవిశ్వేశ్వరాలయంలో మహా పుష్పాభిషేకం, రథోత్సవంలో కోలాటమాడుతున్న మహిళలు



కాళికాంబ చంద్రశేఖర స్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

చిన్నారులకు దుస్తుల పంపిణీ

నంద్యాల(వ్యవసాయం): ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పరివర్తన బాలల కేంద్రంలో హెచ్ఐవీ బాధిత చిన్నారులకు ఆదివారం దుస్తులను అందజేశారు. లయన్స్ క్లబ్ గౌరవాధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, మాజీ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు దాల్‌మిల్ అమీర్ సహకారంతో దుస్తులు అందజేశామన్నారు. నిర్వాహకులు రాయసం బాబురావు, అబ్రహంలింకన్, డాక్టర్ సహదేవుడు, ప్రసాద్, సందీప్ పాల్గొన్నారు.

సామూహిక అభిషేకాల వేదిక మార్పు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయంలో నిర్వహింపబడే సామూహిక ఆర్జిత అభిషేకాల నిర్వహణ స్థలాన్ని మార్పులు చేసినట్లు దేవస్థాన అధికారులు పేర్కొన్నారు. ఆలయ ప్రాంగాణంలోని మూడు శివాలయాల వద్ద, అక్కమహాదేవి-హేమారెడ్డి మల్లమ్మ మందిరాల వద్ద నిర్వహించనున్నట్లు తెలిపారు. ఒక్కో విడతలో 100 టికెట్లు మాత్రమే ఆన్‌లైన్ ద్వారా అందుబాటులో ఉంచుతున్నట్లు వెల్లడించారు.

మహానంది భక్తులతో కిటకిట



మహానంది రాజగోపురం ముందు దీపాలు వెలిగిస్తున్న భక్తులు

మహానంది: కార్తీకమాసం చివరిరోజు, అమావాస్య, ఆదివారం కావడంతో మహానంది ఆలయం భక్తజనంతో కిటకిటలాడింది. వేలాది మంది భక్తుల రాకతో ఆలయ ప్రాంగణాలు కళకళలాడాయి. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సాధారణ భక్తులతో పాటు అయ్యప్పదీక్షా స్వాములు అధికంగా వచ్చారు. ఉదయం నుంచి ప్రారంభమైన స్వామి, అమ్మవారి దర్శనం రాత్రి వరకు నిర్విరామంగా కొనసాగింది. భక్తులు శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. రాత్రి ఆలయ రాజగోపురం ముందు ఉన్న నంది విగ్రహం వద్ద భక్తులు కార్తీకదీపాలు వెలిగించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

మహానందీశ్వరుడికి కల్యాణోత్సవం

మహానందిలో కొలువైన శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు ఆదివారం కార్తీకమాసం, అమావాస్య సందర్భంగా ఉదయం కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, ఆంజనేయశర్మ, హనుమంతు శర్మల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజలు చేపట్టారు. గణపతి పూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజ, మాంగళ్య ధారణ, అక్షింతల సమర్పణ వైభవంగా జరిగాయి. పలు ప్రాంతాల భక్తులు స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని కనులారా తిలకించి పూజలు చేశారు. కల్యాణం అనంతరం భక్తులకు స్వామి, అమ్మవార్ల ప్రసాదాలు అందించారు.